| ఉత్తరప్రదేశ్ | కస్‌గంజ్‌లో మతతత్వవాదుల దాడులు |
|---|---|

**2018** జనవరి 26 నుండి వరుసగా రెండురోజులపాటు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం – కొత్వాల్ ప్రాంతంలోని కస్‌గంజ్ మత కలహాలతో దద్దరిల్లింది. మతసామరస్యానికి, శాంతికి పేరెన్నికగన్న ఆ పట్టణం, అకస్మాత్తుగా ఈ ఘర్షణలలోకి నెట్టబడింది. విహెచ్‌పికి చెందిన వ్యక్తిగా చెప్పబడే చందన్‌గుప్తా ఈ కలహాలలో మరణించాడు.

ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ప్రజలు వివరించిన ప్రకారం వాస్తవాలు ఇలా వున్నాయి :

ఆరోజు గణతంత్ర దినోత్సవం. ఓ ప్రాథమిక పాఠశాల ప్రక్కనే వున్న వీర్ అబ్దుల్ హమీద్ చౌక్ వద్ద ప్రతి సం॥రం లాగే, ఈసారి కూడా కస్‌గంజ్ ప్రజలు జెండా ఆవిష్కరణ వేడుకను నిర్వహించారు. ఈ సం॥ ఆ వేడుక చాలా ఆర్భాటంగా జరిపారు. ఈ వేడుకలు జరుగు తూండగా, మోటారు సైకిళ్ళపై చేతుల్లో త్రివర్ణ, కాషాయవర్ణ పతాకాలను పట్టుకొని, నినాదాలు చేస్తూ వందమందిపైగా యువకులు అక్కడికి వచ్చారు. వారు జెండా ఆవిష్కరణ వేడుకలు జరుగుతున్న ఇరుకైన సందులగుండా తమకు దోవ వదలాలని కోరారు. ఈ వేడుక నిర్వాహకులు మోటారుసైకిళ్ళపై వచ్చిన యువకులతో, 'ఇది ప్రధాన రహదారి కాద'ని, పైగా వేడుకలు జరుగుతూ వున్నాయని చెపుతూ మరో మార్గం గుండా వెళ్ళవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కానీ వారు ఈ విజ్ఞప్తిని లెక్కచేయకుండా ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా గాయపరిచే దూషణలు చేస్తూ, వారిని పాకిస్తాన్ వెళ్ళిపొమ్మని నినాదాలు చేశారు. ఇది ఉద్రిక్తతలను రగిలించి ఇరుమతాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణకు దోవతీసింది. దాడులకు పాల్పడినవారు పలు వాహనాలను ధ్వంసం చేశారు. స్థానికంగా వున్న మసీదును తగులబెట్టటానికి ప్రయత్నించారు. ఆ ప్రాంతం లోని ఓ ప్రముఖ ముస్లిమ్ వ్యాపారస్తుని రెండు అంతస్తుల భవనంపై దాడిచేసి, ఆ ఇంటిని లూటీ చేశారు.

జనవరి 28వ తేదీ ఉదయం చందన్‌గుప్తా అంత్యక్రియలు పూర్తయ్యాయి. దీని తర్వాత నిముషాల వ్యవధిలోనే ఒక గుంపు వచ్చిపడి షాపులను, బస్సులను తగులబెట్టింది. చేష్టలుడిగిన పోలీసుల వైఖరితో శాంతికాముక ప్రజానీకం నిస్సహాయంగా వుండిపోయారు. ఆగ్రా ఇన్‌స్పెక్టర్ జనరల్ డి.కె. ఠాకూర్ చెప్పిన వివరాల ప్రకారం ముస్లిములకు చెందిన 99 శాతం షాపులు తగులబెట్టబడ్డాయి.

పోలీసులు కర్ఫ్యూ విధించారు. ఇంటర్‌నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. పిఏసి, ఆర్‌ఏఎఫ్ బలగాలను దింపి పట్టణంలో కవాతు నిర్వహింపజేశారు. జనవరి 30 నాటికి పోలీసులు 112 మందిని అదుపులోకి తీసుకొని వివిధ నేర విభాగాల క్రింద వారిపై కేసు నమోదు చేశారు. వ్యాపారులు, రాజకీయ పార్టీల నాయకులు ఇరు మతాలకు చెందిన పెద్దలు, సభ్యులు శాంతి సమావేశాలు నిర్వహించి, శాంతి, మత సామరస్యాలను పునరుద్ధరించేందుకు ప్రతిన దీసుకున్న తర్వాత సాధారణ పరిస్థితి నెలకొంది.

అయితే, ఈ మత కలహాలకు కారణమైన అసలు నేరస్తులను అరెస్టుచేసి, తగినవిధంగా శిక్షించగల్గుతారా అనేది ప్రశ్న. ఇది – ఉత్తర ప్రదేశ్‌లోనూ, కేంద్రంలోనూ బిజెపి అధికారంలో వుండటం వలన మాత్రమేగాక, సంఘ్ పరివార్‌కు చెందిన ప్రముఖ నాయకులు కొందరు చేస్తున్న నిర్దిష్ట వ్యాఖ్యానాలు కూడా ఓ ప్రమాదకర ధోరణికి దోవతీస్తున్నాయి.

బిజెపి సీనియర్ నాయకుడైన గిరిరాజ్‌సింగ్ ఇలా వ్యాఖ్యానించాడు : "మరణించిన వ్యక్తి చందన్ గుప్తా కాకుండా మహమ్మద్ ఇస్మాయిల్ అయి వుంటే, ప్రచార మాధ్యమాలలో చర్చలు భిన్నంగా జరిగి వుండేవి. మన ఆలోచనా ధోరణిని మార్చుకోవలసి వుంది." భారతదేశంలో హిందూ మతతత్వ శక్తులు పథకం ప్రకారం సాగించిన దౌర్జన్యపూరిత దాడులలో అమాయక ముస్లిములు, ఇతర అల్పసంఖ్యాకులు, దళితులు, హేతు వాదులు, ప్రగతిశీల శక్తులు బాధితులుగా వున్నారనే విషయం ఈ నాయకునికి తెలుసు. కస్‌గంజ్‌లో చందన్‌గుప్తా మరణాన్ని ఎవరూ ఆహ్వానించరు; అందుకు ఎవరూ సంతోషించరు. అయితే, హిందూ మతతత్వశక్తులు రగిలించిన మత ఉన్మాదానికి అతను ఒక బాధితుడనేది చేదు వాస్తవం.

విహెచ్‌పి నాయకులు మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో ఆహార శుద్ధి ఉపమంత్రి శ్రీమతి నిరంజన్ జ్యోతి ఈవిధంగా మాట్లాడారు : "కొందరు పాకిస్తాన్ అనుకూలురు, జాతీయ జెండాను అంగీకరించటంలేదు. వారు పాకిస్తాన్ జెండాను మాత్రమే గౌరవిస్తారు; పాకిస్థాన్ వర్ధిల్లాలని నినదిస్తారు." బిజెపి పార్లమెంటు సభ్యులు వినయ్ కథియార్ ఇలా వ్యాఖ్యానించారు : "పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచే కొందరు చొరబాటుదారులున్నారు. త్రివర్ణ పతాకాన్ని నిరాకరించటంలో వారు ఎంతదాకైనా వెళ్తారు. వారితో కఠినంగా వ్యవహరించాలి". 2014 నాటి రామజన్మభూమి ప్రచారంలో ముస్లిములకు వ్యతిరేకగా తన ద్వేషపూరిత ఉపన్యాసాల ద్వారా వెలుగులోకి వచ్చిన నిరంజన్ జ్యోతి ఇలా మాట్లాడింది : "ఢిల్లీ ప్రజలు తమకు రాముని అనుయాయుల పాలన కావాలో, అక్రమ సంతాన పాలన కావాలో నిర్ణయించుకోవాలి". ఈ ప్రకటనకు తర్వాత ఆమె క్షమాపణ చెప్పారు.

విహెచ్‌పి, ఏబివిపి మూకలు సాగించిన మతోన్మాదపూరిత చర్యలకు బిజెపి ఉన్నత స్థాయి నాయకుల నుండి ఈ తరహా సంపూర్ణ సమర్ధన చేకూరుతుండగా, మత కలహాలపై ఎలాంటి దర్యాప్తు జరుగుతుందో, ఏవిధమైన న్యాయం జరుగుతుందో ఎవరైనా అర్థం చేసుకో గలరు. హిందూ మతతత్వశక్తుల బలగాలు కేవలం వారి నాయకత్వ భావజాలాన్ని, రాజకీయాలను, ప్రతిబింబిస్తున్నారనేది వాస్తవం. కనుక హిందూ మతతత్వశక్తుల భావజాలానికి, రాజకీయాలకు, చర్యలకు వ్యతిరేకంగా కూలంకషంగా, చివరికంటా పోరాడాల్సిన కర్తవ్యం ప్రజాతంత్ర శక్తుల ముందున్నది.

oooooo